## ప్రశాంతంగా ఏపి ఐసెట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశానికి గాను నిర్వహించిన ఏపి ఐసెట్ ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్ష వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించగా ఉదయం జరిగిన పరీక్షకు 230 మందికి 215 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 231 మందికి గాను 206 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్, చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నాకరరావు తెలిపారు. పరీక్షా కేంద్రం చీఫ్ కో ఆర్డినేటర్ నరేష్, కోఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టిసిఎస్ ప్రతినిధులు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. శశి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షల్లో మొదటి షిఫ్ట్‌లో 220 మందికి 205 మంది హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌కు 222 మందికి 202 మంది హాజరయ్యారు. పరీక్షలు ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా ముగిసినట్లు పరీక్ష కేంద్రాధికారి పి.రాంబాబు తెలిపారు.

# మానవత్వం మరిచారా..!

**'హిమోఫిలియా' రోగుల పట్ల ఏలూరు సర్వజన ఆసుపత్రి యంత్రాంగం తీరు దారుణం**

**ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 270 మందికిపైగా హిమోఫిలియా రోగులు**

**రక్తం గడ్డ కట్టుకునే ఈ రోగులకు ఇంజెక్షన్‌తోనే ఉపశమనం**

**ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఇంజెక్షన్ ఇచ్చేందుకు ముప్పతిప్పలు**

**జిజిహెచ్‌లో ఎన్‌టిఆర్ వైద్యసేవా సిబ్బంది తీరుపైనా బాధితుల ఆవేదన**

ఏలూరు సర్వజన ఆసుపత్రి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రక్తం గడ్డకుని శరీరంలో వాపులు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడే హిమోఫిలియా రోగుల పట్ల ఏలూరు సర్వజన ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రక్తం గడ్డకునే తరుణంలో హిమోఫిలియా రోగులకు వెంటనే సంబంధిత ఇంజెక్షన్ ఇస్తేనే ఉపశమనం కలుగుతుంది. ఆలస్యమయ్యే కొద్దీ అంతర్గత రక్తస్రావంతో వచ్చే నొప్పిని తట్టుకోలేక పరిస్థితి చాలా కష్టమని రోగులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. హిమోఫిలియా రోగం పుట్టుకతోనే వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి. ఈ రోగులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 250 మంది వరకూ ఉండగా, రాష్ట్రంలో రెండు వేల మందికిపైగా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ రోగానికి ఎటువంటి మందులూ పని చేయవు. ఈ రోగాన్ని గుర్తించిన తర్వాత హిమోఫిలియా సొసైటీలు ప్రత్యేక ఐడి కార్డులు సైతం జారీ చేశాయి. ఈ రోగాన్ని అదుపు చేయాలంటే సంబంధిత ఇంజెక్షన్ ఒక్కటే మార్గం. ఈ ఇంజెక్షన్ ప్రభుత్వం మాత్రమే సరఫరా చేస్తోంది. గుంటూరు, విజయవాడ, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ప్రతి జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో ఈ ఇంజెక్షన్ చేసే సదుపాయం ఉన్నట్లు రోగులు చెబుతున్నారు. రక్తం గడ్డకునే సమస్య ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. ఏదైనా పొరపాటున దెబ్బతగిలితే రక్తస్రావం తీవ్రంగా ఉంటుంది. ఏం చేసినా అదుపు చేయడం కష్టం. వెంటనే ఇంజెక్షన్ చేయించాల్సిందే. అతికొంతకుండా ఒక పక్కగా ఎక్కువసేపు కూర్చున్నా, పడుకున్నా రక్తం గడ్డకట్టే పరిస్థితి ఉంటుంది. ఈ విధంగా జరిగినప్పుడు ఇంజెక్షన్ చేయించుకోవాల్సిందే. ఒకోసారి నెలలో నాలుగైదుసార్లు, అంతకంటే ఎక్కువసార్లు సైతం ఇంజెక్షన్ చేయాల్సి వస్తోంది. హిమోఫిలియా రోగులను ఎమర్జెన్సీ రోగులుగా పరిగణించి వైద్యం అందిస్తారు. గతంలో హిమోఫిలియా రోగులు వస్తే వెంటనే ఇంజెక్షన్ చేసి పంపించేవారు. గుంటూరు, విజయవాడ ఆసుపత్రులకు వెళ్లినా హిమోఫిలియా రోగులకు అర గంట, గంట వ్యవధిలోనే ఇంజెక్షన్ ఇస్తుంటే ఏలూరు సర్వజన ఆసుపత్రిలో అసలు పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడంటూ రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉదయం వస్తే సాయంత్రం వరకూ నరకయాతన**

హిమోఫిలియా రోగులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి ఉదయం తొమ్మిది గంటలకు వస్తే సాయంత్రం నాలుగు గంటల వరకూ ఇంజెక్షన్ చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వైద్యుల సంతకాలు కాలేదని కొంతసమయం, సూపరింటెండెంట్ సంతకం కాలేదని కాలయాపన చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తిండితిప్పలు లేకుండా సాయంత్రం వరకూ అక్కడే ఉంటున్నా వైద్యులు, సిబ్బంది కనీసం కనికరం చూపించని దుస్థితి నెలకొంది. దీంతో హిమోఫిలియా రోగులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. గత మంగళవారం ఇద్దరు హిమోఫిలియా రోగులు ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరు సర్వజన ఆసుపత్రికి రాగా, ఇంజెక్షన్ వేసేందుకు వైద్యులు, సిబ్బంది పెట్టిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. పెద్దఎత్తున వాగ్వివాదం జరిగాక సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఇంజెక్షన్ చేసిన పరిస్థితి ఉంది. ఎమర్జెన్సీ రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది ఈ విధంగా వ్యవహరించడంపై అక్కడ ఉన్న రోగులు సైతం అయ్యో.. పాపం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

**ముప్పతిప్పలు పెడుతున్న ఎన్‌టిఆర్ వైద్యసేవా సిబ్బంది**

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పనిచేసే ఎన్‌టిఆర్ వైద్యసేవా సిబ్బంది హిమోఫిలియా రోగుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పరిస్థితి ఉంది. రాష్ట్రంలో ఏ ఆసుపత్రిలో లేని విధంగా ఇక్కడ సిబ్బంది వ్యవహరిస్తున్నారని రోగులు చెబుతున్నారు. రోగులు ఎప్పుడొచ్చినా ఇంజెక్షన్ చేయాలని నిబంధన ఉన్నప్పటికీ ఇటీవలే ఇంజెక్షన్ చేశారు కాబట్టి కుదరదని మాట్లాడుతున్నారు. పైగా వైద్యులు ఎన్‌టిఆర్ వైద్యసేవలో నమోదు చేయించుకోవాలని చెబుతున్నారు. దీంతో అటు, ఇటు తిరగలేక రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లయినా ఇంజెక్షన్ చేసే అవకాశం ఉన్నప్పుడు ఎందుకు ఈ విధంగా ఇబ్బంది పెడుతున్నారో అర్థం కాని పరిస్థితి. ఎవరైనా వచ్చి గట్టిగా మాట్లాడితే అప్పుడు స్పందిస్తున్న పరిస్థితి ఉంది. దీనిపై ఎన్‌టిఆర్ వైద్యసేవా సిబ్బందికి సంబంధిత ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని రోగులు కోరుతున్నారు.

### ఉదయం వస్తే సాయంత్రం వరకూ ఇబ్బంది పెడుతున్నారు..

**సాహో జయంత్, హిమోఫిలియా బాధితుడు, ఏలూరు**

మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరు సర్వజన ఆసుపత్రికి వస్తే సాయంత్రం వరకూ ఇంజెక్షన్ చేయలేదు. సంతకాలు కాలేదని చెబుతూ వచ్చారు. ఏ జిల్లాలోనూ ఇటువంటి పరిస్థితి లేదు. బాధ భరించలేని స్థితికి వస్తోంది. హిమోఫిలియా బాధితులకు వెంటనే ఇంజెక్షన్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి అధికారులను కోరుతున్నాం.

### ఎన్‌టిఆర్ వైద్యసేవ, ఆసుపత్రి సిబ్బంది తీరుతో తీవ్ర ఇబ్బందులు..

**డి.వెంకటేష్, బాధితుడు, ఛానమిల్లి**

హిమోఫిలియా రోగులను ఏలూరు సర్వజన ఆసుపత్రిలో తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. ఇంజెక్షన్ చేసేందుకు సాయంత్రం వరకూ ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఎన్‌టిఆర్ వైద్యసేవా సిబ్బంది సరిగా స్పందించడం లేదు. ఆసుపత్రి సిబ్బందీ అదేవిధంగా వ్యవహరిస్తున్నారు. రోగంతో ఉన్న మమ్మల్ని పైకి, కిందకు పదేపదే తిప్పుతున్నారు. ఇంజెక్షన్ ఆలస్యం అవుతుండటంతో నొప్పిని భరించడం చాలా కష్టంగా ఉంటుంది. త్వరగా ఇంజెక్షన్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

# అల్లూరి పోరాట పటిమ స్ఫూర్తిదాయకం

**కలెక్టర్ నాగరాణి**

ప్రజాశక్తి - భీమవరం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కొనియాడారు. బుధవారం అల్లూరి వర్ధంతి సందర్భంగా భీమవరం జువ్వలపాలెంరోడ్డులోని అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కాంస్య విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి స్వాతంత్ర పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందన్నారు. స్వాతంత్ర పోరాటంలో అల్లూరి చరిత్ర ఒక ప్రత్యేక అధ్యాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సంఘ సంస్కర్త కంతేటి వెంకటరాజు, లైన్ ఇంటర్నేషనల్ సిహెచ్ కృష్ణంరాజు, ఉద్దరాజు గాదిరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

భీమవరంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి, యుటిఎఫ్ నేతలు

**భరతమాత ముద్దుబిడ్డ అల్లూరి : జెవివి సీనియర్ నేత అజయ్‌కుమార్**

జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యుటిఎఫ్ కార్యాలయంలో అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జెవివి సీనియర్ నాయకులు వై.అజయ్‌కుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి గర్వించదగ్గ భరతమాత ముద్దుబిడ్డ అల్లూరి అన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చింతపల్లి ప్రసాదరావు, జె.రామలక్ష్మణరావు, కోశాధికారి మల్లుల శ్రీనివాస్, చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్న బాబు, బొర్రా నాగబాబు, ఫణి రాజేష్, కె.రామకృష్ణంరాజు, పిల్లి.శ్రీనివాస్, ఎస్.సుకుమార్, అలుగు జాన్సన్, టి.వెంకటేశ్వరరావు, క్రాంతి పాల్గొన్నారు.

**అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలి**

**ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి**

స్వాతంత్ర సంగ్రామంలో ప్రాణాలు సైతం పణంగా పెట్టిన అల్లూరి సీతారామరాజు ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి పిలుపునిచ్చారు. భీమవరంలోని అల్లూరి కాంస్య విగ్రహానికి ఎంఎల్‌సి గోపీమూర్తి, యుటిఎఫ్ నేతలు బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో తన ప్రాణాలను అర్పించిన ధీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అల్లూరి జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గిరిజనులను ఒకే తాటిపైకి తీసుకొచ్చి స్వతంత్ర ఉద్యమానికి నాంది పలికారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, పట్టాభి రామయ్య, సీతారామరాజు, సిహెచ్‌వి.ప్రసాద్, రామకృష్ణరాజు, ఏసుబాబు పాల్గొన్నారు.


అల్లూరికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

# జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక

**చివరి ధాన్యపు గింజ వరకూ కొనుగోలు చేస్తాం**

**జిల్లా సమీక్ష మండలి సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్**

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా సమీక్ష మండలి సమావేశం ఇన్‌ఛార్జి మంత్రి రవికుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖా మంత్రి శ్రీనివాస్‌వర్మ, జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ ఆరు నెలలుగా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు, నూతనంగా చేపట్టిన ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రవికుమార్ వ్యవసాయ శాఖపై సమీక్షించారు. రబీలో దిగుబడి ఎంత వచ్చింది, ఎంత కొనుగోలు చేశారు, ఇంకా ఎంత రావొచ్చనే విషయాలను ప్రస్తావించారు. జిల్లాలో ఏయే వెరైటీలు సాగు చేస్తున్నారు, వాటికి బహిరంగ మార్కెట్ ఉందా అని అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, వసతి గృహాలు, ప్రజలంతా వినియోగించే, రైతులకు లాభసాటి అయిన వరి వంగడాల సాగుకు సూచించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ వ్యవసాయ సాగులో డ్రోన్ టెక్నాలజీని బాగా ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందించేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీపై ప్రజల్లో హార్టీకల్చర్ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కాలువలు, డ్రెయిన్ల పూడిక పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ ఉండిలో నిర్మించిన ఫిషరీస్ రీసెర్చ్ స్టేషన్ వినియోగంలోకి రాలేదని, విలువైన యంత్ర సామగ్రి నిరుపయోగంగా ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర ఎస్‌సిపిసి ఛైర్‌పర్సన్ పీతల సుజాత మాట్లాడుతూ స్కూల్స్ విలీనం కారణంగా సమస్యను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఏదైనా సమస్య ఉంటే పరిశీలించాలని డిఇఒను ఆదేశించారు. ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ వికలాంగ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తో వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలపై విలేకరుల సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడారు. అన్ని శాఖల్లో జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్షించామని, ఎంఎల్‌ఎ సభ దృష్టికి తీసుకొచ్చిన అంశాలపై ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో మంచి పరికరాలు ఉన్నా వినియోగానికి టెక్నీషియన్ల కొరత ఉందని తాడేపల్లిగూడెం, తణుకు ఎంఎల్‌ఎలు సభ దృష్టికి తీసుకొచ్చారని, దీనిపై ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రబీలో ఆఖరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు 1.70 వేల గోనె సంచులు అందజేశామని తెలిపారు.

మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రవికుమార్

# 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

**భీమవరం :** కార్మిక చట్టాల మార్పునకు వ్యతిరేకంగా లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్లు పిలుపు నిచ్చాయి. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.భీమారావు అధ్యక్షతన ట్రేడ్ యూనియన్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ట్రేడ్ యూనియన్ల నేతలు మాట్లాడారు. బ్రిటీష్ కాలం నుంచి దేశ కార్మిక వర్గం త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్పుచేసి లేబర్ కోడ్స్‌గా మార్చడం భారతదేశ కార్మిక వర్గానికి తీవ్ర నష్టమన్నారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఐఎన్‌టియుసి, ఎసిసిటియు, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగ సంఘాలు ఈ సమ్మెలో పాల్గొంటున్నాయన్నారు. ఈ నెల 10న జిల్లా సదస్సు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించింది. 12, 13, 14, 15 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ప్రచార యాత్ర నిర్వహించాలని, పని ప్రాంతాల్లో కార్మికులు ఉండే చోట విస్తతంగా గ్రూప్ సమావేశాలు, 17, 18 తేదీల్లో అన్ని పట్టణాలు మండల కేంద్రాల్లో సమ్మె జయప్రదం కోరుతూ మోటార్ సైకిల్ ప్రదర్శనలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్‌రాయ్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎం.రామ్మోహన్, ఐఎన్‌టిసి నాయకులు సుబ్రహ్మణ్యం, ఎఐసిసిటియు నాయకులు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు భీమారావు

దీక్షలో కూర్చున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

## పేదల ఇళ్ల సమస్య పరిష్కరించే వరకూ..

# అల్లూరి స్ఫూర్తితో పోరు

**సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం**

**పాలకోడేరు ఎఎస్‌ఆర్ నగర్‌లో ఒక రోజు నిరాహార దీక్ష**

**పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల మద్దతు**

**పేదలకు న్యాయం చేయాలి**

**సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్**

ప్రజాశక్తి - భీమవరం

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పేదల ఇళ్ల కూల్చివేత సమస్య పరిష్కారమయ్యే వరకూ పోరాటం సాగిస్తామని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం అన్నారు. అల్లూరి 101వ వర్ధంతి సందర్భంగా పాలకోడేరు అల్లూరి సీతారామరాజు నగర్‌లో పేదల ఇళ్ల కూల్చివేతను నిరసిస్తూ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ బుధవారం ఒకరోజు కూల్చిన ఇళ్ల శిథిలాల మధ్య నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో కూర్చున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్‌కు మంతెన సీతారాం పార్టీ కండువా వేసి దీక్షను ప్రారంభించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వగ్రామం మోగల్లు గ్రామానికి ఆనుకుని ఉన్న అల్లూరి సీతారామరాజు నగర్‌లో పేదల ఇళ్లను దుర్మార్గంగా కూల్చి సీతారామరాజు ఆశయాలను తుంగలో తొక్కారన్నారు. ఇప్పటికైనా ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల కూల్చివేత ఆపాలని, ఇప్పటికే కూల్చివేతకు గురైన ఇళ్ల బాధితులకు తక్షణం ప్రత్యామ్నాయం చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలో కూర్చున్న జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ రాజు కాలువ పేదల ఇళ్ల వల్ల కలుషితమవుతుందనేది వాస్తవం కాదన్నారు. కలుషితానికి కారణం ఏమిటనేది నిపుణుల కమిటీ ద్వారా తేల్చాలని డిమాండ్ చేశారు. రఘురామకృష్ణరాజుకు అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి ఉంటే కాలుష్య నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో తెలుసుకోవాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూడు సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రఘురామకృష్ణరాజు అరాచకాలను ఆపేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇళ్లు కోల్పోయిన నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరహార దీక్షకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, ఎపి రైతుసంఘం నాయకులు బాలం విజయ్‌కుమార్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. బుధవారం సాయంత్రం బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎం.రత్నరాజు దీక్షాధారుడు సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్‌కు కొబ్బరి నీళ్లు ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, శేషపు అశ్రియ్య, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ ధర్మేంద్ర పుచ్చకాయల రత్నంరాజు, జిల్లా సెక్రటరీ కొర్ర శ్రీనివాస్ యాదవ్, సిపిఎం భీమవరం పట్టణ నాయకులు బొక్కా సత్యనారాయణ, పాలకోడేరు మండల నాయకులు దున్న మరియమ్మ, బాధితులు మల్లుల దుర్గారావు, పెచ్చెట్టి సత్యనారాయణ, దొంగ నాగరాజు, మెట్టా రామారావు, మల్లుల పద్మ, పైడి ఆదిలక్ష్మి, జోగి నాగలక్ష్మి, గుడాల లక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హరికుమార్ రాజు

గోపాలన్‌కు కొబ్బరి నీళ్లు ఇచ్చి దీక్షను విరమింపజేసిన రత్నరాజు

**కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి ఇళ్ల తొలగింపు సమస్య**

**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హరికుమార్ రాజు**

ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల తొలగింపు సమస్యను కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్‌రాజు తెలిపారు. జూన్‌లో పిసిసి అధ్యక్షురాలు షర్మిల జిల్లా పర్యటనకు రానున్నారని, ఆమెను ఎఎస్‌ఆర్.నగర్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఇంత ఘోరంగా ఇళ్లు కూల్చివేయడం అన్యాయమన్నారు. పేదల పక్షాన నిరంతరం సిపిఎం పోరాడటం అభినందనీయమన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ ధర్మేంద్ర, జిల్లా సెక్రటరీ కొర్ర శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

# రెండు రాష్ట్రస్థాయి రెడ్‌క్రాస్ అవార్డులకు జిల్లా ఎంపిక

**నేడు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్న కలెక్టర్**

ప్రజాశక్తి - భీమవరం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షులు చదలవాడ నాగరాణి అందించిన అత్యుత్తమ సేవలకు గాను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ రెడ్‌క్రాస్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు విజయవాడ రాజ్ భవన్‌లో నిర్వహించే ప్రపంచ రెడ్‌క్రాస్, ప్రపంచ తలసేమియా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అబ్దుల్ నజీర్ నుంచి అవార్డు అందుకోవాలని కోరుతూ రాజ్ భవన్ నుంచి కలెక్టర్ చదలవాడ నాగరాణికి ఆహ్వానం అందింది. రాష్ట్రస్థాయిలో రెండు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవార్డులను పొందడం ఎంతో సంతోషకరమైన విషయమని జిల్లా అధికారులు, సిబ్బంది కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

# పకడ్బందీగా అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

**డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు**

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్, పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశంలో డిఆర్‌ఒ మాట్లాడారు. పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీ, పేపర్ లీకేజ్ వంటివి జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు జరిగే రోజు పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12 నుంచి మే 20 వరకూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ జరుగుతాయన్నారు. 40 కేంద్రాల్లో 18,265 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పది అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 19 నుండి 28వ తేదీ వరకూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ 26 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలకు 5,613 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్ ఓపెన్ స్కూల్ ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. సమీక్షలో జిల్లా ఎఎస్‌పి భీమారావు, డిఐఇఒ ఎ.నాగేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సత్యనారాయణ, డిపిఒ అరుణశ్రీ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు ఎంవిఆర్.దేవరాజు, కెవి.రామారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు

## సిఎం ఆఫీస్‌ నుంచి అని చెప్పి..

**వీరవాసరం** : సిఎం ఆఫీస్‌ నుంచి ఫోన్‌ చేస్తున్నామంటూ వీరవాసరం మండలంలో పలు వివిధ మండల అధికారులకు ఫోన్‌ చేసి డబ్బులు పంపాలని డిమాండ్‌ చేయడంతో ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపి, ఆ తరువాత మోసపోయిన విషయాన్ని గ్రహించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 5వ తేదీన వీరవాసరం తహశీల్దార్‌ కార్యాలయానికి సిఎం ఆఫీస్‌ నుంచి ఫోన్‌ చేస్తున్నామంటూ తహశీల్దార్‌కు ఫోన్‌ రావడం జరిగింది. తహశీల్దార్‌తో మాట్లాడిన అనంతరం వారు రెండు ఫోన్‌ నెంబర్లను తహశీల్దార్‌కు పంపగా ఆ నెంబర్లను ఆర్‌ఐ రాజేంద్రకు ఇచ్చారు. ఒక నెంబర్‌కు ఫోన్‌చేయగా అది పని చేయకపోవడంతో రెండో నెంబర్‌కు ఆర్‌ఐ ఫోన్‌ చేయగా సిఎం ఆఫీస్‌ నుంచి మాట్లాడుతున్నామని, మీరు ఆలస్యంగా రెస్పాన్స్‌ అవుతున్నారని హెచ్చరించారు. ఎంపిడిఒ, తదితర అధికారులంతా ఇక్కడ ఉన్నారంటూ, మీ ఫోన్‌ కాల్‌ రికార్డు అవుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాట్లాడుతుంటే ఆర్‌ఐ భయపడ్డారు. ఇక్కడ అనాథల సంక్షేమం కోసం ఒక కార్యక్రమం జరుగుతుందంటూ ఆ కార్యక్రమ నిమిత్తమంటూ డబ్బులు పంపాలంటూ డిమాండ్‌ చేయడంతో గుండె మార్పులన్నా పేరున ఆర్‌ఐ రూ.15 వేలను ఫోన్‌పే ద్వారా పంపారు. డబ్బులు పంపిన అనంతరం మరోసారి సమాచారం నిమిత్తం వారికి ఫోన్‌ చేయగా ఆ నెంబర్‌ కూడా పనిచేయకపోవడంతో తాము మోసపోయామంటూ ఇది సైబర్‌ నేరగాళ్ల మోసమంటూ వారు గ్రహించారు. ఇదే విధంగా వీరవాసరం సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయానికి ఫోన్‌ చేయడం జరిగిందని అక్కడి సిబ్బంది తెలిపారు. పాలకొల్లులో వారు మరికొన్ని మండల అధికారులకు ఫోన్‌ చేయడంతో వారు కూడా డబ్బులు పంపి మోసపోయినట్టుగా సమాచారం.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**కాళ్ల** : ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిసాము.. చదువుల చెట్టు నీడలో అంటూ ఏలూరుపాడు జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో 2003–2004 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు బుధవారం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఒకేచోటకు చేరుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. పలువురి కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని నిక్‌నేమ్‌లతో పిలుచుకున్నారు. తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకొంటూ యోగక్షేమాలను గురించి వివరించుకున్నారు. పాఠాలను నేర్పించిన ఉపాధ్యాయులను సత్కరించారు. 21 ఏళ్ల నాటి విద్యార్థులను చూసిన ఉపాధ్యాయులు తన్మయత్వంతో మునిగిపోయారు. అనంతరం పూర్వ విద్యార్థుల గ్రూప్‌ ఏర్పాటు చేసి అందరికీ పరిచయం చేశారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**కాళ్ల** : పంటలకు ఎరువులు, పురుగుల మందులు అధిక మోతాదులో వాడితే కలిగే నష్టాల గురించి రైతులకు వివరించాలని ఉండి డివిజన్‌ ఇన్‌ఛార్జి ఎస్‌ఎఫ్‌ఎ మహేష్‌ తెలిపారు. బుధవారం కోమటిగుంట గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామైక్య సంఘాల సభ్యులకు, రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పంటలకు నవధాన్యాల సాగు వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. ప్రజలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంటి రెడ్డి, రమణమ్మ, వివిఎ.దివ్య, ఎల్‌.దుర్గా రాజేశ్వరి, ఐసిఆర్‌పి.సుందరి, గణేష్‌, ఉండి డివిజన్‌ స్టాఫ్‌ పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**పాలకొల్లు** : వేసవిలో బాటసారుల దాహం తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని పాలకొల్లు పట్టణ సిఐ కోశ రజనీకుమార్‌ అభినందించారు. చవకుల చారిటబుల్‌ ట్రస్ట్‌, రోటరీ క్లబ్‌ ఆఫ్‌ పాలకొల్లు సెన్సేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో పాలకొల్లు రైల్వే గేట్‌ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సిఐ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చవకుల చారిటబుల్‌ ట్రస్ట్‌ ఫౌండర్‌ అండ్‌ చైర్మన్‌ చవ్వాకుల సూర్య నరేష్‌ బాబు, నారిన ప్రతాప్‌ రామానాయుడు, మాజేటి రాజా, కేత ఫణి, దేగల సూర్యప్రభ, మండా శేష, రాయి సూరిబాబు పాల్గొన్నారు.

**నరసాపురం:** పట్టణంలోని స్థానిక చినమామిడిపల్లి జవదాలపేట జై భీమ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో క్రీస్తుశేషులు సోడదాసి ఆర్డర్‌ బెన్ని, శాంతమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. బుధవారం తహశీల్దార్‌ ఎవిఐ.సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సరిపల్లె సర్పంచ్‌ ఈద సురేష్‌ బాబు, సరిపల్లి సెక్రటరీ సోడదాసి మోహన్‌ రావు, జై భీమ్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ సోడదాసి శ్రీధర్‌, ట్రస్ట్‌ సభ్యులు వర్ధనపు యేసు లక్ష్మి పాల్గొన్నారు.

## అన్న సమారాధనలో యాత్రికులు

**కాళ్ల :** కాళ్ల గ్రామదేవతలైన మహంకాళమ్మ, వెంకమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాల సందర్భంగా బుధవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కాళ్ల పరిసర గ్రామ ప్రజలు, పెద్దలు, యువత, ఆడపడుచులు అందరూ విచ్చేసి అమ్మవార్ల తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## కోమర్రులో కొండచిలువ కలకలం

**గణపవరం** : మండలంలోని కోమర్రులో బుధవారం కాసాని శ్రీనివాస్‌ ఇంటిలో కొండచిలువ కలకలం రేపింది. శ్రీనివాస్‌ ఇంటి ఆవరణలోని గోడను మరమ్మతుల కోసం పగలకొట్టగా గోడలో కొండచిలువ గుడ్లపైన ఉండగా స్థానికులు ఆందోళన పడ్డారు. కొండచిలువను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. తమ గోడలో కొండచిలువ ఎప్పటి నుంచి ఉన్నది తనకు తెలియదని చెప్పారు. కొండచిలువలు తమ గ్రామాల్లోకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## స్థానిక సమస్యలపై దృష్టి సారించాలి : కమిషనర్‌

**నరసాపురం:** పట్టణంలోని సచివాలయం అడ్మిన్‌ సెక్రటరీలతో బుధవారం నరసాపురం మున్సిపల్‌ కమిషనర్‌ ఎం.అంజయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలోని ప్రజల స్థానిక సమస్యలు అక్కడే పరిష్కారం అవ్వాలన్నారు. వార్డు సచివాలయంలో ప్రతి రోజు తప్పనిసరిగా వారికి కేటాయించిన వర్కింగ్‌ చార్ట్‌ ప్రకారం విధులు చేపట్టాలని ఆదేశించారు. వార్డ్‌ సచివాలయం లాగిన్‌లో నమోదు అయ్యే ఫిర్యాదుల దరఖాస్తులు నిర్దేశిత గడువులోగా పరిష్కారం కావల్సిందేనని, లేకుంటే సంబంధిత సెక్రెటరీలదే బాధ్యత అన్నారు. ప్రతి సెక్రెటరీ విధులకు సక్రమంగా హాజరై నిర్దేశిత సమయానికి విధుల్లో ఉండాలన్నారు. అడ్మిన్‌ సెక్రటరీలు సక్రమంగా పనిచేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి : డిఎల్‌టిఒ

**నరసాపురం:** ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు చర్యలు చేపడతామని డివిజినల్‌ అభివృద్ధి అధికారి(డిఎల్‌టిఒ) జి.రాణి అన్నారు. ఇటీవల డిఎల్‌టిఒగా బాధ్యతలు చేపట్టిన ఆమె మండల పరిషత్‌ కార్యాలయంలో విలేకరులతో బుధవారం మాట్లాడారు. తమ పరిధిలోని పది మండలాల్లో ఎంపిడిఒ, ఇతర అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

## హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

### వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడె విజయలక్ష్మి

**భీమవరం టౌన్‌:** టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా హామీలు నెరవేర్చలేదని వైసిపి జిల్లా మహిళ అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి అన్నారు. బుధవారం భీమవరంలోని వారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టి అందులో లక్ష మందికి లబ్ధి చేకూర్చే విధంగా టెండర్లు పిలిచి అందులో కూడా మోసం చేశారని అన్నారు. ఒక్కో లబ్ధిదారురాలికి రూ.23 వేలు లబ్ధి చేకూరే విధంగా ఏర్పాటు చేశారే కానీ ఒక్కో లబ్ధిదారురాలికి రూ.7,300 మాత్రమే చేరిందన్నారు. కుట్టు మిషన్‌కు రూ.4,300, శిక్షణకు రూ.3 వేలు మాత్రమే ఖర్చు పెట్టారని, మిగిలిన రూ.15,700 దోచుకున్నారని ఆరోపించారు. గోనెసంచుల కొరత తీర్చాలని, తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని విజయలక్ష్మి డిమాండ్‌ చేశారు.

## ముగిసిన కార్మికుల అవగాహన వారోత్సవాలు

**నరసాపురం:** నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ అసంఘటిత రంగంలోని కార్మికులకు నిర్వహిస్తున్న అవగాహన వారోత్సవాలు ముగిసాయి. బుధవారం సాయంత్రం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్‌, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.వాసంతి తన కోర్టు హాల్‌లో రెవెన్యూ, పోలీసు, విద్య, వైద్య, పరిషత్‌, కార్మిక శాఖ, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న వారికి సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి శ్రీవేద, సిఐ జి.దుర్గాప్రసాద్‌ పాల్గొన్నారు.

## మద్యం విక్రేత అరెస్ట్‌

**తాడేపల్లిగూడెం:** తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌ పరిధిలో బుధవారం అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఇ.స్వరాజ్య లక్ష్మి తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్లు దొరబాబు, మురళీమోహన్‌, సిబ్బంది కలసి పెంటపాడు మండలం రాచర్ల గ్రామంలో బెల్ట్‌ షాప్‌ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 10 డ్యూటీపెయిడ్‌ మద్యం సీసాలను స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్‌ వివరాల కోసం సెల్‌: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్‌ వివరాల కోసం సెల్‌: 83339 88814

# ఉత్తమ విద్యాబోధనే జిఎంఆర్‌ విద్యాసంస్థల లక్ష్యం

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

గత 25 సంవత్సరాలుగా తాడేపల్లిగూడెం పట్టణంలో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నామని శ్రీవాసవి జిఎంఆర్‌ జూనియర్‌, డిగ్రీ కళాశాల ఛైర్మన్‌ గ్రంధి సత్యనారాయణ తెలిపారు. ఆ వివరాలు

డిగ్రీ కళాశాల

ఛైర్మన్‌ గ్రంధి సత్యనారాయణ, కరస్పాండెంట్‌ ఎల్‌వివిఎన్‌.లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్‌ వివిఎస్‌ఎన్‌.శ్రీనివాస్‌

ఆయన మాటల్లోనే అతి తక్కువ ఫీజులతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పియూనివర్సిటీ ఫలితాలలో ఉత్తమ ఉత్తీర్ణత శాతం సాధిస్తున్నామన్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో డిగ్రీలో 85 శాతం, ఇంటర్లో 90 శాతం ఫలితాలు సాధించామన్నారు. అరబిందో, రెడ్డి ల్యాబ్స్‌, ఇన్ఫోసిస్‌, టిసిఎల్‌, ఐసిఐసి బ్యాంక్‌ వంటి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించని ఘనత జిఎంఆర్‌ విద్యాసంస్థలదేనన్నారు.. విద్యార్థులస్థాయి ఏదైనా అసాధారణ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా, సాధారణ ఫీజులతో అసాధారణ ఫలితాలు సాధిస్తున్నామని వివరించారు.

### కళాశాల ప్రత్యేకతలు

1. నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ
2. విశేష అనుభవం కలిగిన అధ్యాపక బృందం
3. ఇంటర్‌, డిగ్రీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
4. సెమినార్లు, ఇండస్ట్రియల్‌ పర్యటనలు, క్రీడల నిర్వహణ
5. పూర్తి సౌకర్యాలు కలిగిన ల్యాబ్‌లు
6. సొంత మినరల్‌ వాటర్‌ ప్లాంట్‌ సౌకర్యం
7. క్యాంపస్‌ ప్లేస్మెంట్ల ప్రత్యేకత
8. పరిసర ప్రాంతాలకు బస్సు సౌకర్యం
9. ఫీజు రియంబర్స్‌మెంట్‌ సౌకర్యం

## పద్మశ్రీ అవార్డు పొందడం గర్వకారణం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

స్థానిక 2వ వార్డు వీకర్స్‌ కాలనీకి చెందిన కీర్తిశేషులు మిరియాల అప్పారావు పద్మశ్రీ అవార్డును కైవసం చేసుకోవడం నియోజకవర్గానికి గర్వకారణమని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌ పేర్కొన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత మిరియాల అప్పారావు వారసురాలు ఎడవల్లి శ్రీదేవిని ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ కీర్తి పతాకాలను ఎగురవేసిన బుర్రకథ కళాకారులు మిరియాల అప్పారావు తమ నియోజకవర్గ కాపురస్తులు కావడం తాడేపల్లిగూడెం ప్రజల అదృష్టంగా అభివర్ణించారు. బుర్రకథ కళాకారుడిగా 2025 పద్మశ్రీ అవార్డు గ్రహీత భారత అత్యున్నత పురస్కారాన్ని అందుకోవడానికి ఆయన ఈరోజు లేకపోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతగా ఎన్నికైన వారు అకాల మృతిచెందడంతో వారి కుమార్తె శ్రీదేవి ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతిముర్ము చేతుల మీదగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌ అభినందనలు తెలియజేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : డివైఇఒ

ప్రజాశక్తి – పెనుమంట్ర

నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా లభ్యమవుతాయని నరసాపురం డివైఇఒ డి.మురళీసత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని విద్యాశాఖకు చెందిన పలు విభాగాలను ఆయన తనిఖీ, పర్యవేక్షించారు. మండల విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సదుపాయాల గురించి వివరిస్తూ మండలకేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ప్రయివేట్‌ పాఠశాలలకు దీటుగా క్వాలిఫైడ్‌ టీచర్లతో నాణ్యమైన విద్య, అన్ని మౌలిక సదుపాయాలు ఉచితంగా ప్రభుత్వ పాఠశాలలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం పెనుమంట్ర హైస్కూల్‌లో జరుగుతున్న 10వ తరగతి విద్యార్థుల తరగతులను నరసాపురం డివైఇఒ డి.మురళీసత్యనారాయణ పరిశీలించి, 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలు పాసవ్వటానికి అవసరమైన మార్కుల సాధనకు సలహాలు, సూచనలు విద్యార్థులకు అందించారు. పెనుమంట్ర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్టాక్‌ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. స్టాక్‌ పాయింట్‌ను సమర్థవంతంగా నిర్వహణకు అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంఇఒలు వై.లక్ష్మీనారాయణ, యు.నాగేశ్వరరావు, హైస్కూల్‌ ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రహదారి నిర్మాణ పనుల్లో జాప్యమెందుకు?

### సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్ర రావు

ప్రజాశక్తి – తణుకు రూరల్‌

వేల్పూరు రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి నిర్మాణం పనులు చేపట్టేందుకు ఎందుకు జాప్యం చేస్తున్నారని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్ర రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. వేల్పూరు నుంచి మండపాక వెళ్లే రైల్వే స్టేషన్‌ రహదారి ఏళ్ల తరబడి ఈ రోడ్డు పెద్ద పెద్ద గోతులతో ఏర్పడి రాళ్లు పైకి లేచిపోవడం వల్ల అనేకమంది వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారని వీరభద్రరావు చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గత ఏడాది ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా ఇది మంచి ప్రభుత్వం పేరుతో స్థానిక గ్రామపంచాయతీ వద్ద జరిపిన గ్రామసభకు హాజరైన అధికారులకు సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అధ్వానంగా ఉన్న ఈ రహదారి గురించి ప్రస్తావించామని, ఈ రోడ్డు అభివృద్ధి పనులు తక్షణం చేపట్టాలని వినతిపత్రం అందించామన్నారు. సమాధానంగా సంబంధిత అధికారులు మాట్లాడుతూ ఈ రోడ్డు అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, వారం పది రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని గ్రామసభలో అధికారులు ప్రకటించారన్నారు. దాదాపు పది మాసాలు కావస్తున్న నేటికీ పనులు ఎందుకు ప్రారంభించ లేదని, రోడ్డు నిమిత్తం కేటాయించిన నిధులు ఏమయ్యాయని వీరభద్రరావు ప్రశ్నించారు. తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజలను కలుపుకొని ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

## నాగరాజు పేటలో విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ప్రారంభం

ప్రజాశక్తి – పాలకొల్లు రూరల్‌

పాలకొల్లు నియోజకవర్గంలో విద్యుత్‌ కష్టాలు, బాధలు శాశ్వతంగా తీరేలా రూ.250 కోట్లతో 220 కెవి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేస్తానని, త్వరలోనే దీని నిర్మాణ పనులు మొదలవుతాయని రాష్ట్ర విద్యుత్‌ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ హామీ ఇచ్చారు. మంత్రి రామానాయుడు పాలకొల్లు నియోజకవర్గానికి 220 కెవి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ మంజూరు చేయాలని మంత్రిని కోరగా ఆయన పైవిధంగా స్పందించారు. పాలకొల్లు రూరల్‌ నాగరాజు పేటలో రూ.2.83 కోట్లతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ను మంత్రులు రవికుమార్‌, రామానాయుడు, కేంద్రమంత్రి శ్రీనివాస్‌వర్మ, జిల్లా కలెక్టర్‌ చదలవాడ నాగరాణి తదితరులు కలిసి ప్రారంభించారు. అంతకుముందు పాలకొల్లు పట్టణ 26వ వార్డు బెజవాడ కోడుపై రూ.42.23 లక్షలతో వంతెనకు, కొంతేరు గ్రామంలో ఆవ మీడియం డ్రెయిన్‌పై రూమ్‌ రూ.31 లక్షలతో గ్రావెల్‌ రహదారి, మరో రూ.29 లక్షలతో గ్రావెల్‌ రహదారి, రూ.31 లక్షలతో డ్రెయిన్‌ తవ్వకం



విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ప్రారంభిస్తున్న మంత్రులు

పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌, మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, ఆర్‌డిఒ దాసిరాజు, విద్యుత్‌ శాఖ ఎస్‌ఇ ఎ.రఘునాథ బాబు, టెక్నికల్‌ ఇఇ ఝాన్సీ, ఇఇ బి.రఘు, ఎడిఇ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మున్సిపాలిటీలు ఆనుకుని ఉన్న పంచాయతీల అనుసంధానంకు రోడ్లు, వంతెనల నిర్మాణానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర విద్యుత్‌ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ చెప్పారు. పాలకొల్లు 26వ వార్డు నుంచి రూరల్‌ పంచాయితీకి రూ.43 లక్షలతో నిర్మించే వంతెనకు శంకుస్థాపన చేశారు.

# అల్లూరి స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



ఆచంటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి – ఆచంట

ఆంధ్రప్రదేశ్‌ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో నిరుద్యోగులందరికీ నెలకు మూడువేల రూపాయల నిరుద్యోగ భృతి తక్షణమే విడుదల చేయాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్‌.శర్మ అన్నారు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా స్థానిక కొత్తూరు సెంటర్‌ 1వ వార్డు ఉయ్యాలతాళ్ల వద్ద బుధవారం డివైఎఫ్‌ఐ, బాలల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభను నిర్వహించారు. తొలుత సీతారామరాజు చిత్రపటానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చుండూరి వెంకటసత్యనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ నాయకులు జి.మోహన్‌కుమార్‌, అద్దంకి మణికిరణ్‌, బాలల సంఘం నాయకులు శ్రీపాద ప్రజ్వల, శ్రీపాద ప్రభవ, తమరాపు జితేంద్ర, తమరాపు మౌనిక, పి.అంజలి, పి.భవాని, ఐద్వా నాయకులు యశోద సత్యవాణి, ప్రజాసంఘాల నాయకులు పి.మోహన్‌రావు, తోటపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

**పెంటపాడు:** బ్రహ్మానంద రెడ్డి మార్కెట్‌లో ఉల్లిపాయలు మార్కెట్‌ యూనియన్‌ కార్యాలయంలో చిర్ల పుల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి సిరపవరపు రంగారావు, చల్లా చంద్రరావు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. సిరపవరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు, కరక వెంకట్రావు, కేతిరెడ్డి అప్పన్న, సిరపు మహేష్‌, సిరపు గణేష్‌, దొర్ల సీతయ్య, గొర్లి రమేష్‌, చీర వెంకన్న, మీసాల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

**పాలకొల్లు :** పాలకొల్లు పట్టణంలోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్‌ పాఠశాలలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్‌ మాట్లాడుతూ భారత స్వాతంత్రం కోసం పోరాడిన అనేకమంది వీరుల్లో ఆంధ్రదేశానికి చెందిన అల్లూరిది ఒక ప్రత్యేక స్థానమమని చెప్పారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పిఎంసి ఛైర్మన్‌ కరణం పాపారావు పాల్గొన్నారు.

**గణపవరం :** సీతారామరాజు ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని టిడిపి గణపవరం అధ్యక్షులు కూచంపూడి సురేందర్‌కుమార్‌ రాజు అన్నారు. స్థానిక మారేమ్మ గుడి వద్ద ఉన్న సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎండి బషీర్‌,

### వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు

పల్లివెంకటేశ్వరావు, పల్లి సతీష్‌ పాల్గొన్నారు.

**సిపిఎం ఆధ్వర్యాన..**

**భీమవరం** : బ్రిటీష్‌ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో నేటి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిపిఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రకాశంచౌకు సెంటర్లో అల్లూరి విగ్రహానికి సిపిఎం ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ బ్రిటిష్‌ కాలంలో స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయుడు అల్లూరన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, డి.త్రిమూర్తులు, చెల్లబోయిన, వెంకటేశ్వరరావు, ఒడుగు వెంకటేశ్వరరావు, కె.సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, కె.సోమేశ్వరరావు, డి.నాగు పాల్గొన్నారు.

**పెనుమంట్ర** : తొలి తెలుగు మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుని, వారి త్యాగాలు చరిత్ర మరిచిపోదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్‌ అన్నారు. మండలంలోని నత్తారామేశ్వరం సెంటర్‌లో ఉన్న విప్లవ జ్యోతి అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా రైతు సంఘం నాయకులు కె.సుబ్బరాజు, ప్రజలు పాల్గొన్నారు.

**భీమవరం టౌన్‌** : నేటి యువతరం అల్లూరి సీతారామరాజు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్‌ అన్నారు. అన్నారు. వెంప గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెనుమత్స విశ్వనాథరాజు, మంతెన విశ్వనాథరాజు, ఎం.సత్యనారాయణ రాజు, ఇంజేటి రవికుమార్‌ పాల్గొన్నారు.

**గణపవరం** : అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువతకు ఆదర్శమని సిఐటియు మండలాధ్యక్షులు ఎం.పెంటారావు, కెవిపిఎస్‌ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు అన్నారు. స్థానిక జూనియర్‌ కాలేజీ వద్ద ఉన్న సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అల్లూరి గంగరాజు అలియాస్‌ లెక్కల మాస్టారు, ఎరిచర్ల సతీష్‌, అద్దంకి రాజేంద్ర పాల్గొన్నారు.

**ఆకివీడు** : మండల కేంద్రం ఆకివీడు పట్టణం మెయిన్‌ సెంటర్లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డివైఎఫ్‌ఐ జిల్లా నాయకులు బొడ్డుపల్లి రాంబాబు, డోకల రవితేజలు విజ్ఞప్తి చేశారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లింగాల బలరాం, టి.వెంకటేష్‌, బలరాం రాజు పాల్గొన్నారు.

**పాలకొల్లు** : అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పేదల సమస్యలపై పనిచేయాలని మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్‌ అన్నారు. బుధవారం సీతారామరాజు వర్ధంతి

పెనుమంట్రలో..

సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద అల్లూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో సిపిఎం కన్వీనర్‌ జవ్వాది శ్రీనివాసరావు, వై.అజయ్‌కుమార్‌, చల్లా సోమేశ్వరరావు, ఎస్‌.పురుషోత్తం, తిరుమాని శ్రీనివాస్‌, అప్పన్న పాల్గొన్నారు.

**నరసాపురం:** మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని భగత్‌ సింగ్‌ సేవా విజ్ఞాన కేంద్రం మీరాస్మారక గ్రంథాలయంల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం గ్రంథాలయ నిర్వహణ కమిటీ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహణ కమిటీ సభ్యులు పొగాకు నారాయణరావు, బుడిద జోగేశ్వరరావు, నోములకొండ, పున్నమి అప్పలనాయుడు, యువిఎస్‌.భాస్కరరావు పాల్గొన్నారు.

**తణుకు** : అల్లూరి పోరాటం ప్రజల సమస్యలపై ఉద్యమిస్తున్న ప్రతీ ఒక్కరికి ఆదర్శమని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్‌, శ్రీశ్రీ విజ్ఞాన కేంద్రం చైర్మెన్‌ పి.దక్షిణామూర్తి అన్నారు. బుధవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద శ్రీశ్రీ విజ్ఞాన కేంద్రం, సిఐటియు ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ విజ్ఞాన కేంద్ర సభ్యులు ఆకుల శేషబాబు, యర్రా రాజ్యలక్ష్మీ, స్నేహ, సౌమ్య, సుమ, అంబిక, సువర్ణరాజు, హరిణి, జాహ్నవి, హైమావతి, హర్షిత, దీపక్‌, అజయ్‌ పాల్గొన్నారు.

**యలమంచిలి** : మండలంలోని చించినాడ, కలగంపూడి గ్రామాలలో డివైఎఫ్‌ఐ, కెవిపిఎస్‌, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చించినాడ గ్రామంలోని ఉయ్యాల స్తంభాల సెంటర్‌లో ఉన్న విగ్రహానికి ప్రముఖ అభ్యుదయ వాది, రైతు సంఘం నాయకులు రుద్రరాజు చిన్న వర్మ, డివైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు తెన్నేటి స్టాలిన్‌, డివైఎఫ్‌ఐ జిల్లా మాజీ నాయకులు కానేటి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్‌, కెవిపిఎస్‌ జిల్లా నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్‌ నివాళులు అర్పించారు.

**ఉండి** : మండలంలోని పాందువ్వ గ్రామం సిపిఎం ఆధ్వర్యంలో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. సిపిఎం శాఖ కార్యదర్శి మాదాసి గోపి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎం.ప్రశాంత్‌, సిహెచ్‌ రాంబాబు, లక్ష్మణరావు, మహేందర్‌ ఆనంద్‌, గంగయ్య పాల్గొన్నారు.

## 'న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి'

**భీమవరం :** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భీమవరం కలెక్టరేట్‌ వద్ద మిడ్‌ లెవెల్‌ ప్రొవైడర్స్‌ కమ్యూనిటీ హెల్త్‌ ఆఫీసర్ల నిరవధిక సమ్మె బుధవారం కూడా కొనసాగింది. అసోసియేషన్‌ నేతలు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని ఎన్‌హెచ్‌ఎం కింద సిహెచ్‌ఒలుగా పని చేస్తున్నా రెండేళ్ల నుంచి జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఆరేళ్లు దాటిన సిహెచ్‌ఒలను క్రమబద్ధీకరించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్‌ ఇవ్వాలని, ప్రతి నెలా జీతంతో పాటు ఇన్సెంటివ్‌ ఇవ్వాలని, ఏటా 5 శాతం ఇంక్రిమెంట్‌ ఇవ్వాలని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకూ శాంతియుతంగా సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎంసిఎ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## 'తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

**మొగల్తూరు :** తీర ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి శ్రీవేద సూచించారు. మండలంలోని పేరుపాలెం బీచ్‌లో బుధవారం రాత్రి మాక్‌ డ్రిల్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైనికులు మెరుపు దాడులు చేసిన నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సిఐ దుర్గాప్రసాద్‌, ఎస్‌ఐలు జి.వాసు, వై.నాగలక్ష్మి, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

## శారీరక శ్రమతో ఆరోగ్యం : ఎంపిపి

ప్రజాశక్తి – వీరవాసరం

యుక్త వయసులో బాలికలకు శారీరక శ్రమ ఎంతో అవసరమని ఎంపిపి వీరవల్లి దుర్గభవాని చంద్రశేఖర్‌ అన్నారు. తోలేరులోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన కిషోర్‌ వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో ఎంపిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి బాలికలతో కొద్దిసేపు ఆటలు ఆడుతూ, శారీరక శ్రమ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ప్రతి బాలిక తమ శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి ఆటలు ఆడుతూ ఉండాలని, దీంతోపాటు సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా పూర్తిస్థాయి ఆరోగ్యాన్ని పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి, గంగాభవాని, వెంకటేశ్వరమ్మ, నిర్మల, చిట్టి, లక్ష్మీదేవి, వెంకట నరసమ్మ పాల్గొన్నారు.

## ఇండియన్‌ ఆర్మీ కృషి అభినందనీయం

### ఎంఎల్‌ఎ ఆరిమిల్లి

**తణుకు** : పాకిస్తాన్‌ ఉగ్రవాదుల దాడిని సమర్ధవంతంగా ఎదుర్కొన్న ఇండియన్‌ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్‌ సింధూర్‌ విజయవంతం కావాలని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆకాంక్షించారు. ఇండియన్‌ ఆర్మీకు వాసవిమాత కటాక్షం ఉండాలని కోరారు. వాసవిమాత జన్మదినం పురస్కరించుకుని తణుకులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని బుధవారం తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ దర్శించుకున్నారు. అనంతరం శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవమునకు హాజరై ఆలయంలో నిర్వహిస్తున్న పూజల్లో పాల్గొన్నారు.

## కొనసాగిన వేసవి శిక్షణ తరగతులు

**తాడేపల్లిగూడెం:** అక్షరజ్ఞానంతో విద్యార్థుల భవితకు బాటలు వేసుకోవాలని ప్రథమ శాఖ గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం 10వ రోజు వేసవి శిక్షణ తరగతులలో భాగంగా జనవిజ్ఞాన వేదిక కన్వీనర్‌ ప్రత్తి వీరాస్వామి విద్యార్థులకు నీతికథలు వినిపించి, గ్రంథాలయంలో పుస్తకాలు చదివించారు. జనార్థనరావు పుస్తక సమీక్ష, దేశభక్తి పాటలు పాడించారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కోపెల్ల శ్రీనివాసరావు అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం వేసి విద్యార్థులకు బోధించారు. బుధవారం వేసవి శిక్షణ తరగతులకు 40 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌ పర్సన్స్‌, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**పెనుమంట్ర** : పాఠశాల వయస్సు పిల్లలంతా తమ మానసిక వికాశం కోసం చదరంగం నేర్చుకోవాలని గ్రంథాలయ అధికారి పిటి.శివకుమార్‌ అన్నారు. బుధవారం మండలంలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో పాల్గొన్న పిల్లలకు చదరంగం గురించి వివరించారు. ఈ శిబిరంలో కె.జాస్మిత రెడ్డి, కె.శివాని, ఎన్‌.లక్ష్మి ప్రసన్న, కె.తనీషా, కె.ఫణిశ్రీ నికిల్‌ రెడ్డి, జి.లోచన్‌, జి.తేజశ్రీ పాల్గొన్నారు.

## పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి : ఎంఎల్‌ఎ

**తణుకు :** ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని తణుకు నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ జిల్లా కేంద్ర ఆసుపత్రి వైద్యులకు సూచించారు. బుధవారం రాధాకృష్ణ తణుకు పట్టణంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అత్యవసర విభాగంలో రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు మున్సిపల్‌ కమిషనర్‌ టి.రామ్‌కుమార్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌, ఆసుపత్రి ఆర్‌ఎంఒ సాయిబాలాజీ, హెడ్‌ నర్సు లలిత ఉన్నారు.

## 'బిజిబిఎస్‌ కాలేజీ ఆస్తులకు రక్షణ కల్పించాలి'

**నరసాపురం:** ఎంతో మందికి విద్యను అందించి వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దిన బిజిబిఎస్‌ కాలేజీ ఆస్తుల్ని పాలకవర్గం సభ్యులు దొంగ తీర్మానాలు చేసి అమ్మేసారంటూ కోట్ల రామ్‌ కుమార్‌, కావలి నాని, ముచర్ల త్రిమూర్తులు, డాక్టర్‌ రాజ్యలక్ష్మి, ఝాన్సీలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కాలేజీ ఆస్తుల్ని రక్షించాలంటూ ముందుగా పద్మశ్రీ అద్దేపల్లి సర్వేశెట్టి విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూల దండలు వేసి నివాళులు అర్పించారు. కాలేజీ అభివృద్ధి జరిగాలి, ఆస్తుల్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. పాలకవర్గం ఇదే తీరును అవలంబిస్తే దశల వారీగా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పిడి రాజు, మండా రాజా, సిహెచ్‌.సుబ్రహ్మణ్యం, సమయంతుల సర్వేశ్వరరావు, తెలనాకుల విజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

## విద్యార్థుల మనోవికాసానికి క్రీడలు దోహదం : ఎంఎల్‌ఎ

**తాడేపల్లిగూడెం** : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు త్వరగా లభిస్తాయని ప్రభుత్వ విప్‌, స్థానిక ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌ పేర్కొన్నారు. బుధవారం ఆయన మిలటరీ మాధవరం గ్రామంలోని హైస్కూల్‌లో సమ్మర్‌ క్రికెట్‌ టోర్నమెంటును ప్రారంభించారు. అనంతరం ఎంఎల్‌ఎ బొలిశెట్టి క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రికెట్‌ ఆడి, నిర్వాహకులను ఉత్సాహపరిచారు. గ్రామ సర్పంచి ముప్పిడి సూర్యకుమారి, లక్కోకుల ప్రసాద్‌ పాల్గొన్నారు.

**పదవ తరగతి మార్కులిస్ట్‌ (సర్టిఫికెట్‌) పోయినది**

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం, రామన్నపాలెం పంచాయతీ, బందారువారి పేటకు చెందిన దేశభత్తుల శాంతి, D/o. నరసింహారావు, అను నేను ఈనెల అనగా మే నెల 5వ తేదీన సోమవారం నా పదవ తరగతి మార్క్‌ లిస్ట్‌ రిజిస్టర్‌ నెంబర్‌ **1429648**, సర్టిఫికెట్‌ నెంబర్‌ **FF B 2432B** జిరాక్స్‌ నిమిత్తం మా గ్రామం నుండి సైకిల్‌ పై మార్క్‌ లిస్ట్‌ జిరాక్స్‌ నిమిత్తం పుస్తకంలో పెట్టుకుని వెళుతూ ఉండగా, మార్గమధ్యంలో పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

**దేశభత్తుల శాంతి**
D/o. నరసింహారావు
రామన్నపాలెం పంచాయితీ
బండారువారి పేట,
మొగల్తూరు మండలం - 534281
ఫోన్‌ నెం: 82474 28699